క్లుప్తంగా

23న మండల సమావేశం

సిద్దవటం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశంను ఈనెల 23వ తేదీన జరుగునని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. గురువారం ఉదయం 11.00 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

రాజంపేట రూరల్ : గర్భిణులు, బాలింతలకు అమలు చేస్తున్న ఫేస్ యాప్‌ను రద్దు చేసి సరుకుల క్వాలిటీ, క్వాంటిటీ పెంచి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహా డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ వర్కర్ల చేస్తున్న ఆందోళనకు ఎస్ఎఫ్ఐ నాయకులు సంఘీబావం తెలిపారు. అంగనవాడీల సమస్యలను సీడీపీఓ సుజమనికి వినతి పత్రం రూపంలో అందజేశారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ పనులు పరిశీలన

గాలివీడు : మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ ఈఓ కొండారెడ్డి సోమవారం పరిశీలించారు. మాట్లాడుతూ ఆలయానికి రంగులద్దడం పనులు చివరి దశలో ఉందని, ఉత్తరాయణం మొదలైన వెంటనే విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి శ్రీకారం చుట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న కార్తీక మాసపు ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులు హరికృష్ణ, వీరారెడ్డి, రిషికేష్ తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు నిత్యాన్నదానం

గాలివీడు : కార్తీక మాసంలో అయ్యప్పస్వామి మాలధారులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సేవాభావం సంస్థ అధ్యక్షుడు ఆర్యశంకర్ తెలిపారు. సోమవారం గురుస్వాములతో కలిసి మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ గాలివీడు పెద్దచెరువు కట్టపై ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిరోజు విధిగా మధ్యాహ్న భిక్షను కార్తీకమాసం పూర్తయ్యే వరకు అందజేస్తామన్నారు. దాతలు ఎవరైనా భాగస్వాములు కావాలనుకుంటే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

అర్జీదారులకు అన్నదానం



అర్జీదారులతో కలసి భోజనం తింటున్న ఎమ్మెల్యే

రాయచోటి టౌన్ : అర్జీదారులకు ఉచితంగా నాణ్యమైన భోజనం అందించడం మహానందదాయకమని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో అర్జీదారులకు ఉచితంగా భోజనం అందించే కార్యక్రమం సోమవారం నాటికి 41వ వారానికి చేరుకుంది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే అక్కడికి చేరుకొని అర్జీదారులకు అందించే భోజనం ఎలా ఉందో తెలుసుకొనేందుకు ఆయన వెళ్లి భోజనం తిన్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, షబ్బీర్, ఫయాజ్ అహమ్మద్, జానం రవీంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

సిద్దవటం /ఓబులవారిపల్లె/రాయచోటి అర్బన్ /లక్కిరెడ్డిపల్లె/ నందలూరు/చిట్వేలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆయా మండలాల్లో జరిగిన ముగింపు కార్యక్రమాల్లో అధికారులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. పుస్తకాల పఠనంతో జ్ఞానం పెరుగుతుందన్నారు. సెల్‌ఫోన్‌లలో సమయం వృథా చేసుకునే బదులు ఒక మంచి పుస్తకం చదవాలని తెలియజేశారు. అనంతరం వివిధ రకాల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పని తీరు మెరుగుపరుచుకోండి



అధికారులతో సమీక్ష చేస్తున్న ఎస్ఈ రమణ

సంబేపల్లె : కష్టపడి పనిచేసి పనితీరును మెరుగుపరుచుకోవాలని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ పేర్కొన్నారు. సోమవారం నాగిరెడ్డిపల్లి జగనన్న కాలనీలో సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లకు అల్లుకుంటున్న తీగలను తొలగించడం, లైన్లకు అడ్డంగా ఉన్న కొమ్మలు కత్తిరించడం, ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను నిర్మూలించాలని ఆయన సిబ్బందికి సూచించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈ చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలి
- ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



ఓబులవారిపల్లె: మాట్లాడుతున్న సాయికిషోర్‌రెడ్డి



రాయచోటి టౌన్: వీరబల్లిలో పాలవెల్లువ సంఘం సభ్యులతో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



రాయచోటి అర్బన్: కరపత్రాలు చూపుతున్న నేతలు

వీరబల్లె (రాయచోటి టౌన్) : సాధికారత, సంక్షేమాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం వీరబల్లె పరిధిలోని పెదివీడు గ్రామంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. అలానే జగనన్న పాలవెల్లువ మహిళా డైరీ సహకార సంఘాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగనన్నే సీఎం అవ్వాలని తెలిపారు. అనంతరం ఆయన మండల కేంద్రంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు సిరిగిరి కుళ్లాయి రెడ్డి తనయుడు శ్రీనివాసరెడ్డి రూ. 2.5లక్షలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా వాటిని పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించారు. అలాగే దిగువ రాచపల్లెలో సర్పంచ్ నాగులమ్మ ఆధ్వర్యంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ శివరాం, రామ్మోహన్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, పశుసంవర్ధకశాఖ డీడీ మాలకొండయ్య, రూరల్ సీఐ తులసీరాం పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో మళ్లీ జగనన్న సీఎం చేసుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని మాజీ ఎంపీపీ, సివిల్ సప్లయి డైరెక్టర్, పోలు సుబ్బారెడ్డి తెలియజేశారు. సోమవారం మండల పరిధిలోని గొర్లమొదివీడు మండల బీసీ నాయకులు పల్లపు రమేష్ అధ్యక్షతన రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లిరెడ్డి,ఈఓపీఆర్‌డీ సర్పంచ్, సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య, మాజీ ఎంపీటీసీ చంద్ర, కో ఆప్షన్ ఖాదర్ బాష, వైసీపీ నాయకులు చలమారెడ్డి, మహేష్, మహేష్‌రెడ్డి,పవన్‌కుమార్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

చిన్నమండెం : సీఎం జగన్‌తోనే బడుగు, బలహీనవర్గాలకు సామాజిక న్యాయం సాధ్యమైందని సర్పంచులు లోకేష్‌కుమార్‌రెడ్డి, అఫ్రోజ్, ఎంపీటీసీ వెంకటప్పనాయుడులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బోనమల సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చుక్కా అంజనప్ప, వైఎస్ఆర్‌సీపీ నాయకులు శేఖర్, మురళి, అలీజాన్, హసన్ బాషా, రెడ్డిమల్లు, శివయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దే అని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్‌లు అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో సోమవారం రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్య, వైద్యం తదితర రంగాలలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగింది జగన్ ప్రభుత్వంలోనే అని తెలియజేశబూరు. కార్యక్రమంలో అల్తాఫ్, షబ్బీర్, ఖదీర్, రియాజుర్ రహిమాన్, నవరంగ్ నిస్సార్‌లు పాల్గొన్నారు.

నందలూరు (రాజంపేట) : సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు ఏపీకీ జగన్ కావాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆడపూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ నందలూరు చైతన్య భారతి అధ్యక్షతన ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో అన్నం నాగేంద్ర, ప్లలె మాధవి, కరీముల్లా ఖాన్, సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, ఏకుల రాజేశ్వరిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్ తెలిపారు. మండలంలోని జ్యోతి గ్రామ సచివాలయంలో సోమవారం సాయంత్రం స్థానిక సర్పంచ్ పి. సుబ్బమ్మ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలని అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రామాపురం : రాష్ట్రం బాగుండాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేద్దామని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి అన్నారు. మండలంలోని సరస్వతిపల్లె గ్రామ సచివాలయం వద్ద సోమవారం జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఆధారంగా జగనన్న పాలనలో అందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చెందుతున్నారన్నారు. సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా జరిగిన సంక్షేమ పథకాలను తెలిపే ప్రగతి బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తోందని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొర్లకుంట సచివాలయ పరిధిలో ఆంధ్ర రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయికిషోర్ రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ఏదో విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, సీఎం జగన్ ప్రజాపక్షపాతి అన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రోహిణీ కుమార్ రెడ్డి, సర్పంచ్ సావిత్రమ్మ, మాజీ సర్పంచ్ రమేష్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : అభివృద్ధి సంక్షేమ పథకాల సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, మరలా ముఖ్యమంత్రిగా జగనే కావాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదేశాలతో దప్పేపల్లె గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగనన్న కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, సయ్యద్ అమీర్, రవిరాజు, లక్ష్మినారాయణ, ఉప సర్పంచ్ సురేష్, రాజారెడ్డి, వైఎస్సార్ సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర సుందరీగా శ్యామలాంబ

చిట్వేలి : మండల కేంద్రంలో శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మొదటి సోమవారం శ్యామలాంబ అమ్మవారికి ఉదయం పూజలనంతరం పసుపు, కుంకుమలతో అలంకరించారు. సాయంత్రం త్రిపురసుందరీగా అమ్మవారు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే మహిళలు ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. కార్తీక మాసోత్సవాల నిర్వహణకు కార్యనిర్వహకులు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి



సీసీ కెమెరాలను ప్రారంభించిన ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు : ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఊరు సీసీ కెమెరాల నిఘాలో ఉండటం ఎంతో శ్రేయస్కరమని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మదుసూదన్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయిలతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ రైల్వేకోడూరు పట్టణం భద్రతకు తను సొంతంగా రూ.7లక్షలతో సీసీ కెమెరాలు పట్టణమంతా ఏర్పాటు చేశానన్నారు. ఇలా ప్రతి మండలంలో నాయకులు, పెద్దలు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని సీఐ అన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : నవంబరు 27, 28 తేదీలలో విజయవాడలో నిర్వహిస్తున్న కార్మిక, కర్షక ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు పిలుపునిచ్చారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ధర్నా విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల పాలకులు ప్రజలపై అన్ని రకాల భారాలు మోపుతూ నడ్డి విరుస్తోందన్నారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, రంగారెడ్డి, నాగబసిరెడ్డి, రామచంద్రలు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



విజేతలతో ఉపాధ్యాయులు, నేతలు

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన అండర్ – 14 బాలుర 67వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. కర్నూలు ప్రథమ, కడప ద్వితీయ, విజయనగరం తృతీయ, ప్రకాశం నాల్గవస్థానాలు సాధించాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం ప్రథమ, చిత్తూరు ద్వితీయ, కృష్ణా తృతీయ, అనంతపురం నాల్గో స్థానాలు సాధించాయి. వ్యాయామ తనిఖీ అధికారి భానుమూర్తి రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఎల్‌వీ మోహన్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఎంపీపీ చంద్రలు విజేతలను అభినందించి మెడల్స్ అందించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, పీడీ డేవిడ్ ప్రసాద్, అధికారిణి వసంతకు, నాయకులకు, స్వచ్ఛంద సంస్థలకు, పూర్వ విద్యార్థులకు, పోలీస్ శాఖకు అధికారి భానుమూర్తి రాజు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏబీఎం ప్రసాద్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ నిర్మాణానికి స్థలం మంజూరు చేయించండి

రాయచోటి : పట్టణ పరిసర ప్రాంతాలలోని ఆటో కార్మికులకు ఆటోనగర్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలకు సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి రాయచోటి పట్టణంలో ఆటోనగర్ నిర్మించాలని పలుమార్లు అధికారులను అడిగినా పట్టించుకోలేదని కలెక్టర్, ఎమ్మెల్యేలకు తెలిపారు. పట్టణంలో చాలా మంది ఆటో కార్మికులు ఉన్నారన్నారు. తామంతా ఒకేచోట ఉండి షాపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుకూలమైన స్థలం కేటాయించాలన్నారు. దీంతో వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డిలు జిల్లా కేంద్రంలో ఏపీఐఐసీ సహకారంతో ఆటోనగర్ నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు.

మోడల్ కాలనీగా జగనన్న లేఅవుట్



విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు

- నాగిరెడ్డిపల్లెలోని జగనన్న కాలనీలో సబ్ స్టేషన్ ప్రారంభం
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డి జగనన్న లే అవుట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు సౌలభ్యంగా, సౌకర్యంగా నియోజకవర్గంలో ఒక పెద్ద జగనన్న లేఅవుట్ కాలనీలో విద్యుత్ ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయడం రాష్ట్రంలోనే బహుశా ఇదే మొదటిదన్నారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులను అభినందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అనుకున్న మేరా లక్ష్యాలను సాధించడంలో విద్యుత్ శాఖ బాగా పనిచేస్తోందన్నారు. మున్సిపల్ శాఖ పరిధిలో కాలనీలో ఏర్పాటు చేసిన 1000 వీధి లైట్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రాయచోటిలో అనేక సమస్యలు ఉండేవన్నారు. ప్రస్తుతం వాటిని ఎదుర్కొని అర్జీ పెట్టుకున్న ప్రతి రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ అందజేస్తున్నామన్నారు. జగన్ ప్రభుత్వంలో 6 వేలకు పైగా కనెక్షన్లు ఇవ్వగలిగామన్నారు. గత ప్రభుత్వంలో కేవలం 1800 ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఇవ్వలేకపోయారని చెప్పారు. రింగ్‌రోడ్డు నుంచి ఎంజీ లే అవుట్‌కు లైటింగ్‌తో పాటు లే ఔట్ మొత్తం పోల్స్ నాటడానికి అధికారులు ఎంతో సహకరించారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్దన్‌రెడ్డి, ఎస్ఈ రమణ, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, సర్పంచ్ అలివేలమ్మ, సింగల్‌విండో డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, ఉపేంద్రనాథరెడ్డి, ఎంపీటీసీ రాజకుమారి, వసంత శ్రీనివాసులరెడ్డి, నాగరాజు యాదవ్, డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఓఎస్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గిరిజనులకు భూ పంపిణీ చేయాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలోని చిట్వేలు మండలం చెర్లోపల్లె పంచాయతీ శివపురం ఎస్టీ కాలనీ వాసులకు వెంటనే భూ పంపిణీ చేయాలని సీపీఐ (ఎంఎల్) రాష్ట్రకమిటీ సభ్యుడు జి.రమణయ్య, జిల్లా నేత ఎం. విశ్వనాథలు డిమాండ్ చేశారు. గిరిజనులకు భూ పంపిణీ డిమాండ్‌తో సోమవారం వారు గిరిజనులతో కలసి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ చెర్లోపల్లెకు చెందిన 40 గిరిజనుల కుటుంబాలకు భూములు పట్టాలుగా ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని సర్వే నంబరు – 1399లో ఒక్కో కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున భూ పంపిణీ చేయాలన్నారు. లేని పక్షంలో గిరిజనులతో కలసి భూ పోరాటం చేస్తామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజనులు రమణయ్య, పెద్దన్న, రమణ, అంకయ్య, శ్రీనివాసులుతోపాటు పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఆకేపాటి, అజయ్‌రెడ్డిలు

పెనగలూరు : మండలంలోని చక్రంపేట వద్ద వడ్డిపల్లి వేంకయ్యస్వామి ఆలయం వద్ద సిమెంట్ రోడ్డు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక సోమవారం నాడు ఈ రోడ్లను ప్రారంభించడం శుభదాయకమన్నారు. జెడ్పీ నిధులు మండల ఫండ్స్‌తో కలిపి రాజంపేట – నెల్లూరు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి వడ్డిపల్లి వద్ద వెంకయ్యస్వామి ఆలయానికి రోడ్డు నిర్మించారన్నారు. అలాగే వెంకయ్యస్వామి ఆలయంలో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు రెడ్డి, ధనుంజయరెడ్డి, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, పేరంవారిపల్లి రెడ్డయ్య నాయుడు, యానాదిరెడ్డి, రాధాకృష్ణరెడ్డి, నాగేశ్వరనాయుడు, పొందలూరు సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



పక్కీరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గాలివీడు : డీసీసీ బ్యాంకు సహకార సంఘాలలో తక్కువ వడ్డీకే ఖాతాదారులకు రుణాలను అందిస్తామని సహకార సంఘం చైర్మన్ మిట్టపల్లె వేదమూర్తి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం 75వ అఖిల భారత సహకార వారోత్సవాలను మండల కేంద్రంలో చైర్మన్ మిట్టపల్లె వేదమూర్తిరెడ్డి, నూలివీడులో చైర్మన్ జిల్లా నారాయణరెడ్డిలు ఘనంగా నిర్వహించారు. మొదటిగా మాజీ అధ్యక్షులు కీ.శే మిట్టపల్లె పక్కీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాట్లాడుతూ సహకార సంఘాలు డీసీసీ బ్యాంకులలో విరివిరిగా ఖాతాదారులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని, ప్రతి ఖాతాదారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు డిపాజిట్లు రైతులకు, ప్రజలకు ఉపయోగపడుతున్నాయని తెలియజేశారు. వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మిట్టపల్లె మధుసూదన్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ సీ.వి.నారాయణరెడ్డి, సహకార సంఘం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘కులగణన’ను త్వరితగతిన పూర్తి చేయండి

ఓబులవారిపల్లె : మండలంలో కులగణన సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ విజయారావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కులగణన సర్వేపై సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నవంబర్ 27వ తేదీ కులగణన సర్వే ప్రారంభమవుతుందని డిసెంబర్ 5వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన శిక్షణను ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండలంలో కుల సర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ శ్రీధర్ రావులు అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి డిసెంబర్ నెల 3వ తేదీ వరకు కుల సర్వేను విజయవంతంగా నిర్వహించాలన్నారు. గడువులోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక సోమవార సందడి



రాజంపేట టౌన్: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రాయచోటి టౌన్: అర్ధనారీశ్వరి అలంకరణలో..



రైల్వేకోడూరు అర్బన్: పూజలందుకున్న భుజంగేశ్వరుడు

సిద్దవటం : శివాలయాల్లో కార్తీక సోమవారం పూజలు వైభవంగా జరిగాయి. మండల పరిధిలోని జ్యోతి గ్రామంలోని సిద్దవటేశ్వరస్వామి ఆలయంలో, సిద్దవటంలోని శ్రీ కామాక్షిదేవి సిద్దవటేశ్వర స్వామి ఆలయంలో, కపర్దీశ్వరస్వామి ఆలయంలో, కనుమలోపల్లె ఉమాదేవి సహిత నీలకంఠేశ్వరస్వామి, శ్రీ నిత్యపూజస్వామి ఆలయంలో, మాధవరం శ్రీ అమరలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

రామాపురం : కార్తీక మాసంలో ఎంతో పవిత్రంగా భావించే కార్తీక సోమవారం మండలంలోని పలు శైవ క్షేత్రాలలో కార్తీక సోమవార పూజలు కేదారేశ్వర వ్రతాలు నోముల పండుగలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో కార్తీక మాసం మొదటి వారం రోజైన సోమవారం ఆలయంలో శ్రీ కేదారేశ్వర స్వామి (అఘోరలింగేశ్వరుడు) వ్రతం, పూజలు నిర్వహించారు. ఈ పూజలలో స్థానిక మహిళలు విశేషంగా పాల్గొన్నారు. అలానే పట్టణంలోని పాత రాయచోటిలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వరుడు అర్ధనారీశ్వరుడిగా భక్తులకు దర్శనమిచ్చారు.

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజుపురం శివాలయం, పట్టణంలోని భుజంగేశ్వర ఆలయాలల్లో వైభవంగా కార్తీక సోమవార పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో మొదటి సోమవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

రాజంపేట టౌన్ : హరహర మహాదేవ శంభో శంకర నామస్మరణతో శైవక్షేత్రాలు హోరెత్తాయి. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని శివాలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వేకువజాము నుంచే మహిళా భక్తులు శివాలయాలకు తరలి వచ్చి దీపాలను వెలిగించారు. ఆలయాల్లో శివ, పార్వతుల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. అనేక మంది నోములు నోచుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా శివాలయాల్లో ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



రామాపురం: పూజల్లో పాల్గొన్న మాలధారులు

విద్యార్థులు ఆడుతూ పాడుతూ ఎదగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మంద నాగేశ్వరావు

రాయచోటి టౌన్ : విద్యార్థులు చిన్నతనం నుంచి విద్యాభ్యాసం అంతా ఆడుతూ పాడుతూ ఎదగాలని మండల న్యాయ సహాయక సలహా న్యాయవాది మంద నాగేశ్వరావు విద్యార్థులకు సూచించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు బాలల హక్కులను వివరించారు. ఆయన మాట్లాడుతూ నేటి పిల్లలే భావి భారత పౌరులని చెప్పారు. విద్యార్థులు బాల్యమంతా ఆడుతూ పాడుతూ చదవాలని తెలిపారు. చిన్నారులకు నాణ్యమైన ఆహారంతో పాటు వారికి నచ్చేవిధంగా పాఠ్యాంశాలు నేర్పాలన్నారు. విద్యార్థుల లక్ష్యాలను చేరువ చేయడంలో తల్లిదండ్రుల ముఖ్య భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగరాజ, రామచంద్రయ్య, లీగల్ సెల్ సిబ్బంది విజయ్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : రైతుల రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి తహసీల్దార్ పుల్లారెడ్డిని కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సాయికిషోర్ రెడ్డి పాల్గొన్నారు. స్పందన కార్యక్రమానికి విచ్చేసిన రైతుల సమస్యలు గురించి తహసీల్దార్‌కు వివరించారు. ప్రధానంగా సర్వేకు సంబంధించిన ఆన్‌లైన్ ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఇందుకు తహసీల్దార్ పుల్లారెడ్డి స్పందిస్తూ క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.